చుక్కతో పిల్లల ఎటువంటి రోగమైనా టక్కున తగ్గిపోతుంది. "బెంగాల్ కెమికల్ వర్క్స" కేటలాగులో ఇంకా మంచి మందు వుంటుంది. శరవేగంతో తిరగేస్తున్నాడు. ఆలోచనలు వాయు వేగంతో భయంలోనించీ దూసుకు పోతున్నై. తన పాప ప్రాణంపోతుంటే ఎలా ఊరుకుంటాడు? ఊహా జగత్తులోని ఔషధం వాడుతున్నాడు. ఎంతసేపైందో తెలీదు. మళ్ళీ భార్య వచ్చింది బావురుమంది. తల్లి ఏడుపుకి మిగతపిల్లలుకూడా ఏడవడం మొదలెట్టారు.

సీతారాం కేటలాగ్ అవతల పారేశాడు. అదరి పడి లేచాడు. "భయంలేదు. ఏడవకు ఏమిటి పిచ్చి? శైలకు ఏమీ కావటానికి వీల్లేదు. ఇదుగో డాక్టరు దగ్గరికి తీసుకుపోతున్నాను."

కొయ్యపెట్టె తెరిచాడు. అందులో పైసలు లేవని తెలుసు. చెయ్యిపెట్టి వెతుకుతున్నాడు. కాని డాక్టర్ ఫీజు—మందుఖర్చు, కావాని. పెట్టెలోనుండి పైసలు తియ్యాలని చెయ్యి తడుపు తునే వుంది. తను శైలదగ్గరికి పోలేదు. అపరాధికి లాగా ధైర్యం చాలటంలేదతనికి. కాని శైలే తన దగ్గరికి నచ్చింది. తల్లి ఎత్తుకొచ్చింది శైలశరీరం. "ఏమి తండ్రిని—రాక్షసుణ్ణి."అని ఏమో గొణిగాడు.

స్కెచ్

# వీరనాగరికులు

యం. వై. రెడ్డి

"పిక్చర్ కెళ్తున్నాం; పోదాంపద!" ఆహ్వా నించాడు నాలుగడుగల అయిదంగుళాల ఆజానుబాహుడు.

"అరరే! రానంటావేమిటి? తప్పకుండారావాలి! ఇంతమంది విద్యార్థులం సహపాఠులం పిలుస్తుంటే— అచ్చే పిలవడమేమిటి ఆహ్వానిస్తూంటే— నువ్వు తిరస్కరించటం ఏమీబాగాలేదు. లే లే...పోదాం"! బాహుమూలల్లోకి చొక్కా చేతులు మడచిన ఒక విద్యార్థి ఉద్ఘాటించాడు.

"చూడండిరోయ్! డబ్బులేదట! డబ్బుంటే నేలకు పోతాడట! ఇన్‌సల్ట్! విద్యార్థి ప్రపంచానికే అవమానం! విద్యార్థి ప్రపంచం ఇతనిమీద మర్యాద నష్టం దావా వేయాలి; విద్యార్థి ప్రపంచానికీ జై!" అంటూ కాలేజి విద్యార్థి సంఘాధ్యక్షుడు విద్యార్థి లోక నినాదాన్ని నినదించాడు.

"అంతేకాదు! ఇంకా ఏం విన్నవించుకుంటు న్నాడో చూడండోయ్! వాళ్ళనాన్న బీదవాడట. వాళ్ళ ఆస్తి అంతా ముప్పాతిక ఎకరం మాగాణి మాత్రమేనట! దానిమీద వాళ్ళకుటుంబమంతా బ్రతకాలిట కనుక, ఏమీ ఖర్చుపెట్టడట! అయితే, ఇంతకూ మాకు మాత్రం ఎంత ఆస్తి ఉందేం! ఆస్తి ఉండటానికి. సినిమాలకు ఖర్చు పెట్టడానికి ఏమీ సంబంధంలేదు." ప్రవచించాడు—"జీ" ధోరణిలో, చేతితో తన ముంగురులను సవరించబోయి నొసటి దిలీప్‌కుమార్‌ను అనుసరించే ప్రయత్నంలో పైకి ప్రమాదవశాత్తు,జారవిడుస్తున్న వానికిమల్లే ఒక సహ పాఠి. "నేనీ సినిమాకు వెళ్ళడ ఆరవసారి! నీవొక సారైనా చూశావూ?" కళాపోషకుడు వ్యంగ్య పూరితమైన హేళనాదృష్టితో ప్రశ్నించాడు.

"తప్పకుండా రావాలి..." స్నేహితులు తన సినిమా ఖర్చును భరించగలరా...లేదా...అనే సంశయకల్లోలితమానసుడై ఒక పేడిమూతి విద్యార్థి బలవంత పెట్టాడు.

"ఇంతకూ మీరందరూ ఒక విషయం చెప్ప డానికి మరిచారు. ఈ వేళ హంసగమన యెల్లమ్మ, గజగమన లక్ష్మిదేవి, మార్జాలగమన హేమ, మనం పోయే ఆటకే పోతున్నారు. బలేమజాగా ఉంటుం దిలే! వాళ్ళ అందం...చందం! సినిమాలో తెగగోల చేసేద్దాం! వంచిన తలలిక ఎత్తగలరా? గుండె లుండి ఏడవద్దూ!... మంచితరుణం... మించి పోవును...ఆలసించిన ఆశాభంగము..." భావి భారతపౌరుడు, భారతదేశపు వెన్నెముక, నేటి విద్యార్థి...రేపటి పౌరుడు...ఆశ చూపెట్టాడు.

"అలాగా!" అంటూ తమ ఉత్సాహం ద్విగుణీ కృతమైనదనడానికి సూచనగా గోల చేశారు మిగతా విద్యార్థులు.

"ఏమిట్రా! ఇంకా కదలడు! మనకెక్కడ దొరికాడురా శనిబండలా!...నాగరికతే తెలీదు" చొక్కా వేసుకోకుండా బనియనును "ఇన్" చేసి పిక్చర్‌కు తయారైన ఒక నవనాగరికుడు.

"పిసినారి."

"మేనర్సు తెలియవు."

"పల్లెటూరి గమారి."

"పుస్తక కీటకం."

రకరకాలుగా సాగాయి టీకాతాత్పర్యసహితాలైన వ్యాఖ్యలు.

"లేచాడర్రోయ్!" ఆశ్చర్యంతో తెరచిననోరు తెరచినట్లే ఉంచాడు అజానుబాహుడు.

"నాకు తెలుసు! ఊరికే అలా అంటాడుగాని నిజంగా అతనికి మాత్రం రావాలని లేదూ... మనల్ని గమ్మత్తుగా ఏడిపించాలని తప్పితే!" పరిశోధనా ఫలితాన్ని ప్రకటించాడు మడచిన చొక్కా చేతులు.

"విద్యార్థి ప్రపంచానికి జయము తప్పదు; ఎంతటి వీరధీరశూర విక్రమాదిత్యుడైనా తలవంచక తప్పదు!" నిశ్చయ ధ్వనిలో ధీమాతో సంతృప్తి వెల్లడించాడు విద్యార్థి నాయకుడు.

"నా ప్రవచనానికి దేశకాల పరిస్థితులు అడ్డురావు" "—జీ" నోటినుంచి అమృత వాక్కులు బయల్వడినాయి.

"కళారాధనకు, కళాసేవకు ఎంతటి నిర్భాగ్యుడైనా అంజలి ఘటించి, జోహారు లర్పించవలసినదే!" ధీమాతో కళాప్రియుడు.

"డబ్బు సరిపోతుందో లేదో..." అనుమాన భయాలతో కొట్టుమిట్టాడుతూన్న విద్యార్థి హృదయ మనోవేదనల బాధ తీవ్రతరమైంది.

"అనుచర సంఖ్యాభివృద్ధి" నోటిలోకి వచ్చిపడుతున్న హృదయంతో అన్నాడు భావిభారత పౌరుడు.

"నాగరికతా ప్రభావానికి లొంగని మనుజుడుండటం దుర్లభం" నాగరికుడు.

"నాగరికుడు"

"విచిత్ర విద్యార్థి"

"రాజాధిరాజు"

"దానకర్ణుడు"

పొగడ్తల కంతు లేదు.

ఇంతలో ఒక ఆగంతుకుడు ప్రవేశించాడు: "నేనొక విద్యార్థిని. స్కూలుఫైనల్ చదువుతున్నాను. పరీక్ష ఫీజు కట్టడానికి డబ్బులేదు! అయిదురూపాయలు తక్కువయినాయి. మీరు మీ చేతనయినంత సహాయంచేస్తే...!" అంటూ ప్రధానోపాధ్యాయుడు వ్రాసిఇచ్చిన ధ్రువ, వినతి, పత్రాన్ని చూపించాడు.

"ఇదేం ధర్మసత్రమనుకున్నావా?"

"డబ్బులు లేవు! అందరికీ ఇదొక వేషమైపోయింది." ఎవరికి తోచినట్లు వారు తమ అమూల్యాభిప్రాయాలను వెలిబుచ్చారు. ప్రపంచం ఆ ఋణబాధనుండి ఎప్పుడు విముక్తినొందుతుందో!

ఇంతలో కళా పిపాసి అరిచాడు "మళ్లీ ఇలా మారిపోయా డేమిటి ఈయన! ఒకటికి లేచానంటున్నాడు. మన మందరమూ పొరపాటుపడినామంటున్నాడు...ఇలా ఉంటుం దితని వ్యవహారం, ప్రవర్తన!"

ఎవడైనా "నువ్వు పుట్టినప్పటినుంచి ఎప్పుడైనా స్నానం చేశావా!" అని ప్రశ్నిస్తే, ప్రదర్శించే ఆశ్చర్య భంగిమను ప్రదర్శిస్తూ, అందరూ తెరచిన నోళ్ళను తెరచినట్లే ఉంచారు.

"పిసినారి"

"లోభి"

"పల్లెటూరిగమారి"

"పుస్తక కీటకం"

"నమ్మకద్రోహి"

లెక్కకు మిక్కుటమైన ఆశీర్వాదాలు వర్షించాయి. రూములో బీడీ, బయట సిజర్సు కాల్చే, ఒక విద్యార్థి బీడీ కాల్చవలెనా లేక సిగరెట్టు వెలిగించవలయునా అని ఆలోచిస్తూ, ఒక తిరుగులేని తీర్మానాన్ని ప్రవేశపెట్టాడు, 'వీడు రాకపోతే రాకపోయాడు; మనం పోదాం పదండి."

తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదించబడింది. వెళ్ళిపోతున్నవాళ్ళు మరునిమిషంలో ఆశ్చర్యంతో కొయ్యబారిపోయారు. తాత్కారణం: "మీ మేలు మరువలేనండి; మీరిచ్చిన రెండు రూపాయలు నాకు చాలా సహాయపడతాయండి" అంటూన్న ఆగంతుకవిద్యార్థి కృతజ్ఞతా వచనాలు వారి చెవుల బడడమే!

★